



శ్రీసిటీలో వేడుకగా తిరంగా ర్యాలీ

శ్రీసిటీలో ఆదివారం 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రిపుల్ ఐటీ మాజీ చైర్మన్, స్ట్రాలినిటీ సంస్థ సీఈవో ఎం.బాలసుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు గౌరవ చిహ్నంగా 'ఐఐఐటీ-శ్రీసిటీ, క్రియా యూనివర్శిటీ, స్టేషన్- ఎస్, శ్రీసిటీ సంయుక్తంగా తిరంగా ర్యాలీ చేపట్టాయి. శ్రీసిటీ- ట్రిపుల్ రిజిస్ట్రార్ కల్నల్ ఉమాశంకర్, క్రియా యూనివర్శిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సీ.పీ.సత్యశరణ్, నోవా ఎయిర్‌టెల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసులు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్, శ్రీసిటీలోని వెస్ట్‌ఫార్మా, ఆస్ట్రోటెక్ స్టీల్స్, వెర్మిరన్, జెన్ లెనిన్ సిద్ధార్థ లాజిస్టిక్స్, బ్లైండ్‌హబ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఫ్రీ బస్సు రెడీ



- ఆగస్టు 15నుంచి అమలు
- రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా
- తిరుమలకు మాత్రం ఉచితం లేదు

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ ఆర్ఎం జగదీష్

రాష్ట్ర ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ఈనెల 15 తేదీ నుంచి శ్రీకారం చుట్టనున్న విషయం తెలిసిందే. ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అయితే తిరుపతి - తిరుమల ప్రయాణానికి మాత్రం ఉచితం లేదని అధికారులు అంటున్నారు. రేషన్ కార్డు/ఓటర్ ఐడీ/ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి కండక్టర్‌కు చూపిస్తే చాలు. ఆయన 'జీరో' టికెట్ ఇస్తారు. ఈ పథకాన్ని పక్కాగా అమలు చేయడానికి అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జగదీష్ 'ఆంధ్రజ్యోతి'తో సంభాషించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం

ప్రభుత్వం, ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు వచ్చాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. సిబ్బందికి పలు దఫాలుగా అవగాహన కల్పిస్తున్నాం. బస్సుల కండిషన్స్ మెరుగుపరుస్తున్నాం. పూర్తిస్థాయిలో మరమ్మతులతో పాటు రంగులు వేస్తున్నాం. పాడైన బస్సులు అవకాశం ఉన్న వరకు సిద్ధం చేస్తున్నాం. ఆన్ కాల్ డ్రైవర్లను తీసుకోవడానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాం. కండక్టర్లకు ఓడీ (ఓవర్ డ్యూటీ) ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిబ్బంది అవసరం కాబట్టి బస్టాండ్లలో, రిజర్వేషన్ కౌంటర్లు, అనౌన్స్‌మెంట్ ఇతర పనులకు ఉన్న కండక్టర్లను లైన్ మీదకు పంపే యోచనలో ఉన్నాం.

రీజనల్ పరిధిలో మొత్తం బస్సులు : 918

సొంత బస్సులు : 723, అద్దె బస్సులు : 195,
కొత్త బస్సులు : 65, డిపోలు: 11,
ఏ డిపోలో ఎన్ని బస్సులు : తిరుపతి 116, అలిపిరి 147, తిరుమల 99, మంగళం 97, శ్రీకాళహస్తి 108, పుత్తూరు 85, సత్యవేడు 55, గూడూరు 58, సూళ్లూరుపేట 38, వెంకటగిరి 62, వాకాడు 50
ప్రయాణికుల సంఖ్య : 2.25లక్షలు (రోజుకు),
రోజుకు బస్సులు తిరిగే కి.మీ : 3.39 లక్షలు,
ఆదాయం : రూ1.70 కోట్లు (రోజుకు),
ప్రస్తుతం మహిళలు ప్రయాణిస్తున్న శాతం : 40,
ఉచితం అమలైతే పెరిగే అంచనా : 63 శాతం.

● రద్దీ ప్రాంతాల్లో మరిన్ని బస్సులు

తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరుకు అదనపు బస్సుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. పీక్ అవర్స్ రూట్స్ అయిన శ్రీకాళహస్తి, చిత్తూరు, సత్యవేడు, కాణిపాకం సర్వీసులు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు మరిన్ని బస్సులు ఏర్పాటు చేయనున్నాం. అంతేగాకుండా గూడూరు, వాకాడు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల్లో తిరిగే బడి బస్సులను కూడా ఖాళీ సమయంలో రోడ్డెక్కించనున్నాం. లాంగ్‌రూట్ బస్సులను ఖాళీగా ఉంచకుండా రద్దీ ప్రాంతాలకు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వారాంతం, పర్వదినాలు, సెలవులు రోజుల్లో ఓఆర్ (ఆక్యుపెన్సీ రేట్) తక్కువగా ఉన్న రూట్స్‌ను రద్దు చేసి రద్దీ ప్రాంతాలలో నడపనున్నాం. తిరుమలకు నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లకు, నాన్‌స్టాప్ బస్సులకు స్పష్టత లేదు. తిరుపతి-తిరుమల మధ్య ఉచిత ప్రయాణం ప్రస్తుతానికి లేదు. అధికారికంగా ప్రకటన వస్తే మరిన్ని మార్పులు జరగవచ్చు.



రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

● మహిళ, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు

చిట్టమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు మలుపు సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పెన్నెపల్లికి చెందిన వెంకటరమణయ్య, భార్య నవీనమ్మ, పిల్లలు కిషోర్, స్వర్ణ ఆదివారం నాయుడుపేట మండలం గొట్టిప్రోలు చర్చికి వెళ్లి వస్తున్నారు. వాకాడు చర్చి కాంపౌండ్‌కు చెందిన కావలి కిరణ్ నాయుడుపేట నుంచి వాకాడుకు బైక్‌లో వెళుతున్నారు. చిట్టమూరు మండలం మొలకలపూడి మలుపు సమీపంలో ఈ రెండు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. వెంకటరమణయ్య(40), కావలి కిరణ్ (36) అక్కడికక్కడే మృతి చెందగా, నవీనమ్మ, కిషోర్, స్వర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ చిన్న బలరామయ్య తన సిబ్బందితో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



వెంకటరమణయ్య - కిరణ్ (ఫైల్‌ఫొటోలు)

దంచికొట్టిన వాన



తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

తీరం.. అల్లకల్లోలం

అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరం అల్లకల్లోలంగా మారడంతో అలలు ఎగిసిపడుతున్నాయి. వాకాడు, కోట, చిల్లకూరు సముద్రతీరంలో తీరంలో 3 మీటర్ల ఎత్తున కెరటాలు ఎగిసిపడుతున్నాయి. 5 మీటర్లు ముందుకు సముద్రం చొచ్చుకొనిరావడంతో మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు వేట కొనసాగించలేని పరిస్థితి నెలకొందని మత్స్యకారులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి











తిరుపతిలో ఆదివారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో ప్రారంభమై దాదాపు రెండు గంటల పాటు కురిసింది. ఈ వర్షానికి నగర వీధులు నదులను తలపించాయి. రైల్వే అండర్ బ్రిడ్జిలు, ప్రధాన కూడళ్లలో నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అన్నారావు కూడలి నుంచి ఖాదీకాలనీ మార్గంలో ఓ భారీ వృక్షం నేలకూలింది. మూడు దశాబ్దాల కాలంనాటి ఈ చెట్టు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి నానడంతో కూలిపోయింది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారుల సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం అధికారులు చెట్టును తొలగించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అమ్మవారి దర్శనానికి తోపులాట







దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు - తొక్కిసలాటతో చిన్నారిని భుజంపైకి ఎక్కించుకుని..





తోపులాటలో నలిగిపోతున్న భక్తులు

● క్యూలైన్‌లో ఇబ్బంది పడ్డ భక్తులు

తిరుచానూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో ఆలయ పరిసరాల్లో రద్దీ కనిపించింది. మధ్యాహ్నం మూడో నెంబరు గేటు వద్ద టిక్కెట్ల కోసం భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో క్యూలైన్‌లో తోపులాట జరిగింది. క్యూలైను నుంచి భక్తులు వెలుపలకు వచ్చారు. దీంతో కాసేపు క్యూలైన్‌లో గందరగోళం ఏర్పడింది. సర్వదర్శనానికి గంటకుపైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. వేచి ఉండేందుకు వసతి గృహం లేకపోవడంతో అమ్మవారి నైవేద్యం సమర్పించిన తరువాత ఒకసారిగా భక్తులను క్యూలైన్లలోకి పంపించారు. దీంతో తోపులాట జరిగి భక్తులు ఇబ్బంది పడ్డారు. చిన్నారులు, వృద్ధులతో వచ్చిన భక్తుల అవస్థలు వర్ణనాతీతం. కొందరు గేట్లు దూకి బయటకు వచ్చారు. లడ్డుకౌంటర్ వద్దా రద్దీ కనిపించింది.ఇలాంటి సమయాల్లో అదనపు విజిలెన్సు సిబ్బందిని పర్యవేక్షణకు నియమిస్తే తోపులాటను నియంత్రించవచ్చు.

పవన్‌పై దాడి వెనుక 15 మంది

- కొందరు తిరుపతి వైసీపీ నేతల హస్తం
- చిత్తూరులో షెల్టర్ ఇప్పించిన ఐదుగురిని గుర్తించిన పోలీసులు
- కాల్‌డేటా, సాంకేతిక ఆధారాలతో విచారణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పవన్‌కుమార్‌పై దాడి ఘటనలో పోలీసులు విచారించే కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దాడి వెనుక మొత్తం 15 మంది ఉన్నట్లు.. వారిలో తిరుపతికి చెందిన ఐదారుగురు కీలక నేతల హస్తం ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడైన వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, అతని అనుచరుడు జగదీశ్వరరెడ్డి, దినేష్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో పాకాలకు చెందిన వైసీపీ నేత దినేష్ పవన్‌ను ఫైబర్ లాఠీతో పాటు దుడ్డు కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. ఇతడిని పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ఇక, పవన్‌కుమార్‌ను దాడి తర్వాత చిత్తూరుకు కారులో తీసుకెళ్లి అక్కడ బంధించి షెల్టర్ ఇప్పించిన ఐదుగురిని పోలీసులు గుర్తించి, విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పవన్‌కుమార్‌తో ఎవరెవరికి ఎలాంటి సంబంధాలున్నాయి? అతడు పనిచేస్తున్న లాడ్జి యజమాని, మేనేజర్‌ను విచారణ చేస్తున్నట్లు తెలిసింది. బాధితుడు పవన్‌తోపాటు, అరెస్టయిన ముగ్గురు నిందితుల మొబైల్ ఫోన్లు సీజ్ చేసిన పోలీసులు, వారి కాల్ డేటాను సమగ్రంగా పరిశీలించారు. నెల రోజులుగా ఎవరెవరితో మాట్లాడారనే కాల్ డేటా తీసుకున్నట్లు తెలిసింది. మరోవైపు సాంకేతిక ఆధారాలతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో కేసును ఛేదించే పనిలో తిరుపతి పోలీసులున్నారు. ఇక, తిరుపతి ఆర్టీసీ బస్టాండు నుంచి పవన్‌కుమార్‌ను ఎవరు.. ఏ రూటులో తీసుకెళ్లారనేది సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్‌కుమార్ రెడ్డి బైక్ రెంటల్ కార్యాలయంలో వున్న సీసీ కెమెరాలనుంచీ ఫుటేజీలను సేకరించారు. అన్ని ఆధారాలతో సమగ్రమైన వివరాలతో మరో ఎఫ్ఐఆర్ నమోదుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

భూమనకు కౌంట్ డౌన్ స్టార్ట్

- జెరాక్స్ షాపు పెట్టుకున్న మీకు రూ.వేల కోట్లు ఎలా వచ్చాయ్?
- తండ్రీ కొడుకలిద్దరినీ ఒకే జైలుకు పంపుతాం
- టీడీపీ జాతీయ అధికారప్రతినిధి పట్టాభి ధ్వజం

తిరుపతి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): 'ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి అనేక అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డారు. ఇక్కడి వారిని వేధించుకు తింటున్నారు. వారి పాపాలు పండి, కౌంట్ డౌన్ స్టార్ట్ అయిపోయింది' అని టీడీపీ జాతీయ అధికారప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల దళిత యువకుడు పవన్ కుమార్‌ను భూమన అనుచరులు అనిల్ రెడ్డి, జగ్గా రెడ్డి, దినేష్‌తో చిత్రహింసలు పెట్టిన వీడియో చూసి అందరూ నివ్వెరపోయారు. కేసు నమోదు చేశాక మళ్లీ బెదిరించి, మా అన్నే కొట్టాడని బాధితుడి చేత చెప్పించారు. కిడ్నాపర్ల చెర నుంచి పవన్‌ను పోలీసులు రక్షించి, నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ అఘాయిత్యాన్ని వెనుకనుంచి నడిపించిన తండ్రీ కొడుకులను విడిచిపెట్టేది లేదు' అని స్పష్టం చేశారు. జెరాక్స్ షాపు పెట్టుకున్న నీకు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయంటూ భూమనను పట్టాభి ప్రశ్నించారు. 'మీ భూకబ్జాలు, అవినీతి, అక్రమాలపై మా దగ్గర ఆధారాలున్నాయి. స్వర్ణముఖి నదీపరీవాహక ప్రాంతంలో (సర్వే నెంబరు 479) 9 ఎకరాలు కబ్జా చేసింది నిజం కాదా? 472,3,4లో 15.64 ఎకరాలు భూమి ఉంటే దానికి అనుగుణంగా నదీగర్భాన్ని కూడా మట్టితో పూడ్చేశావు. కబ్జా చేయలేదని నిరూపించే శక్తి నీకుందా? మీడియా ముందు నీతికథలు చెబుతూ...తెరవెనుక అంతుపట్టని అక్రమాలు చేస్తావు. టీటీడీ, తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే 21 ఆస్తులు కొనుగోలు చేసినట్టు నువ్వే ఎలక్షన్ అఫిడవిట్‌లో చూపించావు. మాస్టర్ ప్లాన్ పేరిట టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి తెరలేపారు. టీడీఆర్ బాండ్ల అవినీతిపై విచారణ పూర్తయింది. ఏతండ్రైనా కొడుకును ప్రయోజకుడు చేయాలని చూస్తారు. నువ్వేమో పరమ బడుద్దాయి లాగా తయారు చేశావు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికలో అప్పటి డీసీ చంద్రమౌళీశ్వర్ రెడ్డిని అడ్డుపెట్టుకుని దాదాపు 35వేల దొంగ ఓట్లు తయారు చేయలేదా? ఈసీ విచారణలో నిర్ధారణ కావడంతో డీసీని సస్పెండ్ చేయడంతో పాటు ఓ ఐఏఎస్ అధికారిపై మచ్చపడలేదా? దీనివెనుక సూత్రధారులు మీరు కాదా? మీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆధారాల సహా తండ్రీ కొడుకులను ఒకే జైలుకు పంపుతాం' అని పట్టాభి అన్నారు. ప్రశాంతంగా ఉన్న తిరుపతిని తండ్రీ కొడుకులు భ్రష్టుపట్టిస్తూ కూటమి ప్రభుత్వంపై లేనిపోని అబాండాలు వేస్తున్నారని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మండిపడ్డారు. ఎన్ని నాటకాలు వేసినా భూమన కుటుంబానికి రాజకీయ భవిష్యత్తు లేదని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ, సుబ్బు యాదవ్, అత్తులూరి ఆనంద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


యూటీఎఫ్ జెండా ఎగురు వేసిన ఉపాధ్యాయులు

చంద్రగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం మండల ఉపాధ్యాయులు యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడు రామిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా మండల యూటీఎఫ్ అధ్యక్షుడు రాజేంద్రబాబు మాట్లాడుతూ 51 సంవత్సరాల నుంచి యూటీఎఫ్ ఉపాధ్యాయులకు అండగా నిలబడిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మునిచంద్రనాయుడు, ధనంజయ, లక్ష్మీ, చెంచయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



చంద్రగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అరిగిలవారిపల్లెలో నరేంద్ర హాస్పిటల్(తిరుపతి) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎముకలు, జనరల్ మెడిసన్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని తమ ఆస్పత్రికి వచ్చి ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునని హాస్పిటల్ వైద్యులు తెలిపారు. వైస్‌ఎంపీపీ వెంకటరత్నం, గ్రామస్తులు మణి యాదవ్, చెగర్రాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పాకాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వల్లివేడులో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పీఎస్ఎన్‌మూర్తి, డాక్టర్ ఎన్ సిద్దోజిరావ్‌లు పాల్గొని ఆవిష్కరించారు. గ్రామంలో దివంగత జి. సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు, ఎ.గోవిందు, టి.బాబు, టి. పరదేశిలు ఈ విగ్రహాన్ని నిర్మించారు. గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ డీసీవో ఎ.కృష్ణమూర్తి, వివిధ సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ కుంభాభిషేకం



పాకాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యా స్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున ధ్వజస్తంభ కుంబాభిషేకం, మయూర వాహన విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఓ అజ్ఞాత భక్తుడు ధ్వజస్థంభానికి ఇత్తడి తొడుగు చేయించారు. రావిళ్ల మోహన్ కుటుంబ సభ్యులు మయూర వాహన విగ్రహాన్ని చేయించి ప్రతిష్ఠించారు. ఆలయ ప్రదాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో పురోహితులు శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు నిర్వహించి ధ్వజస్థంభానికి కుంబాభిషేకం చేశారు. మయూరవిగ్రహాన్ని ప్రతిష్ఠించారు.కార్యక్రమంలో ఆడికృత్తిక ఉత్సవ కమిటీ చైర్మెన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నృత్యం నయనానందకరం



తిరుచానూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన భరత నాట్య నృత్య ప్రదర్శనలు నయనానందకరంగ సాగాయి. వారాంతపు సెలవుల్లో భాగంగా అరక్కోణంకు చెందిన యుగాస్ మ్యూజిక్ అండ్ అకాడమీ కళాకారులు యుగవరసి, కవియ, రక్ష, మనీషా, దియా, నెర్రైమలర్, తామ్రక్షణ, పృథ్వీక, అలిస్ జెమియా, సంగీర్తన, బ్లెస్సీ, ప్రియదర్శిని తదితరులు నటరాజా అంజలి, భారం ఒకటే, తరిరాజం పుష్పాంజలి, కృష్ణావధారం, విష్ణు కౌత్వం, బొమ్మ బొమ్మదన్, పచాయి మయిల్, ఆండాల్ కౌత్వం వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారిని శిల్పారామం ఏవో సూర్యతేజ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రోడ్డుపై తవ్వేసి వ్యర్థాలు వదిలేస్తే ఎలా?


డ్రైనేజీకాలువ తవ్వి నిర్మాణ వ్యర్థాలను రోడ్డుకు అడ్డంగా పడేసిన దృశ్యం

తిరుపతి రూరల్, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మినగర్‌మీదుగా ఎంఆర్‌పల్లె జెడ్పీహైస్కూలికి వెళ్లే దారిలో డ్రైనేజీకాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈక్రమంలో కాలువ మధ్యలో తవ్వేసి దానికి అడ్డంగా సిమెంటురాళ్లని పెట్టారు. తవ్వేసిన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వదిలేశారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వీటిని తొలగించాలని వారు కోరుతున్నారు. ● లింగేశ్వర నగర్ పంచాయతీలో డ్రైనేజీకాలువలో మట్టి, వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు నిలచిపోయి అధ్వానంగా తయారైంది. సమీపంలో ఉంటున్న వారు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు


దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

రామచంద్రాపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌కమ్మపల్లిలో 11రోజులుగా నిర్వహించిన మహాభారత ఉత్సవాలు ఆదివారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిశాయి.. ఉదయం 11గంటలకు ఆలయం ముందు మట్టి ప్రతిమతో తయారుచేసిన దుర్యోదనుడి ప్రతిమ ఎదుల ధుర్యోధన వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణుని సూచనల మేరకు భీముడు పరుషపదజాలంతో దుర్యోధనుడ్ని బయటకు రప్పించి తొడపై గదతో కొట్టడం, మరణించే ఘటాన్ని పాత్రధారులు రక్తికట్టించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం కంకణం ధరించిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయం వద్దకు చేరుకన్నారు. ద్రౌపదీ అమ్మవారి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్ద కొలువుదీర్చారు. అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. భాగవతారిణి జ్యోత్స్న కురుక్షేత్ర సంగ్రామాన్ని వినిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమేష్, గ్రామపెద్ద మార్కొండయ్యనాయుడు, ఆలయ అర్చకులు హరిస్వామి పాల్గొన్నారు.

తలకోన ఆలయ పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం తలకోన సిద్ధేశ్వర స్వామి దేవాలయ పాలక మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకు అర్హత,ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈమేరకు దేవదాయశాఖ అధికారులు ఆదేశాలు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సనాతనధర్మం పట్ల విశ్వాసం, చిత్తశుద్ధి ఉన్నవారు ఈ నెల 27లోగా తిరుపతి ప్రాంతీయ దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. పాలక మండలి చైర్మన్‌తో పాటు సభ్యులు కూడ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పాలక మండలిగా ఎల్లమంద పంచాయతీకి చెందిన సోమనాథరెడ్డి వ్యవహరిస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లుల్లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 84,404 మంది భక్తులు దర్శించుకున్నారు. 34,930 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో యూపీ మంత్రి


మంత్రి సునీల్ బరాల

తిరుమల, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి సునీల్ బరాల ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

21న రాగి రేకుల వేలం

తిరుమల, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కాపర్ సిల్వర్ కోటెడ్ రాగి రేకులకు ఈనెల 21వ తేదీన టీటీడీ ఆఫ్‌లైన్ ద్వారా టెండర్ కమ్ వేలం వేయనుంది. ఇందులో మూడు వేల కేజీల(15 లాట్లు) వేలానికి ఉంచనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను 0877 2264429 ఫోన్ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని టీటీడీ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది.

కృష్ణ మందిరం ప్రారంభం

రామచంద్రాపురం, ఆగస్ట 10(ఆంధ్రజ్యోతి): కమ్మకండ్రిగ హరిజనవాడ గ్రామంలో ఆదివారం కృష్ణ మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి, వాస్తు హోమంతో పాటు కలశ ప్రతిష్ట నిర్వహించారు. సాయంత్రం సుదర్శన హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతితో ముగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఉభయదాత, సర్పంచ్ కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

'ఫర్నిచర్ ధ్వంసం చేశారు'

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కోవర్క్ స్పేస్ సంస్థ కార్యాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని ఆ సంస్థ వ్యవస్థాపకుడు నరేంద్ర కవేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళంలోని తమ కార్యాలయంలోకి శనివారం భవన యజమాని తులసిరామన్ కవేటి అనుచరులు పవన్, సందీప్, మంగళం నాని, బాబ్జి, చరణ్‌రెడ్డి దౌర్జన్యంగా చొరబడి రూ.70లక్షల విలువైన ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులను ధ్వంసం చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫర్నిచర్ ధ్వంసంతో మాకు సంబంధం లేదు

వ్యాయామశాల ఏర్పాటు కోసం అమెరికాలో ఉన్న తులసిరామన్ నుంచి మంగళం సప్తగిరికాలనీలోని భవనాన్ని ఈ ఏడాది జూలై ఒకటో తేదీన లీజు అగ్రిమెంట్ పొందామని, అయితే ఆయన తమ్ముడు నరేంద్ర కవేటి భవనాన్ని ఖాళీ చేయకుండా తాము దాడులు చేసినట్లు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని ప్రదీప్ ఎకుమార్ ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వారే పథకం ప్రకారం ఫర్నిచర్‌ను ధ్వంసం చేసుకుని నిందలు వేస్తున్నారన్నారు.

విఖనసాచార్యుల సన్నిధికి మలయప్పస్వామి



తిరుమల, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆదివారం ఉత్తర మాడవీధిలోని విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేశారు. విఖనస మహర్షి జయంతి శ్రావణ పౌర్ణమి జరిగిన మరుసటి రోజు శ్రీవారి ఉత్సవమూర్తులు విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం నిర్వహించి నివేదన చేపట్టారు. ఆలయ పారుపత్తేదారు బాలసుబ్రహ్మణ్యం, విఖనస ట్రస్టు కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి దళితవాడకు చెందిన జయరామయ్య లారీడ్రైవర్ (35) డ్రైవర్. సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆదివారం ఇంటి నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో పొయ్య వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జయరామయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయ అభివృద్ధికి వడివడిగా అడుగులు

సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద రూ.3.35 కోట్లతో పనులు


ప్రకృతి ఒడిలో సుబ్రమణ్యస్వామి ఆలయం

పాకాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద రూ.3.35 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఊట్లవారిపల్లె నుంచి ఆలయం వరకు కట్టపై రోడ్డు విస్తరించారు. సిమెంటు రోడ్డు వేశారు. డివైడర్ పనులు పూర్తి చేశారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రూ.3కోట్ల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో కల్వర్టు నిర్మించారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కేటాయించిన రూ.35 లక్షలతో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో ఆర్టీసీ బస్సులు, వాహనాలు రాకపోకలు సాగించేలా, పార్కింగ్ చేసుకునేలా ఏర్పాటు చేశారు. అక్కగార్ల గుడివరకు రోడ్డు సౌకర్యం కల్పించారు.

సకల వసతులు

ట్యాంక్ ద్వారా సురక్షిత తాగునీరు భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ఆవరణలో వసతులు కల్పించారు. స్వామివారిని దర్శించుకోవడానికి రాతి మెట్లు, సైడ్ గ్రిల్స్, లైటింగ్ ఉన్నాయి. అన్ని వసతులతో రెండు కళ్యాణ మండపాలు, కళ్యాణ కట్ట, విశాలమైన కమ్యూనిటీ హాల్ ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, భక్తులు, దాతల సాయంతో ఆలయం, ఆవరణ అందంగా ముస్తాబయ్యాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని ఈఆలయాన్ని తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయానికి దీటుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఆదిశగానే వడివడిగా పనులు చేయిస్తున్నారు.


ఆలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

● కళాశాల ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన

నెల్లూరు(క్రైం)/ సత్యవేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న ప్రైవేటు కళాశాలలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాలెంకు చెందిన పి.తిరుమల, వేదవతి కుమార్తె హేమశ్రీ(16) ఈ ఏడాది జూన్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చేరింది. హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటోంది. చదువులో ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని, మరో సెక్షన్‌కు మార్చాలని కొంతకాలంగా కళాశాల సిబ్బందిని అడుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 9న రాత్రి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తాను చాలా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. ఆదివారం ఉదయం కూడా తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసింది. ఏం జరిగిందో ఏమో హేమశ్రీ అనారోగ్యానికి గురవడంతో సమీపంలోని వైద్యశాలలో చేర్పించామని, పరిస్థితి విషమంగా ఉందని హాస్టల్ సిబ్బంది ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. వారు హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని చూడగా కుమార్తె చనిపోయింది. దీంతో గుండెలవిసేలా విలపించారు. ఈ క్రమంలో బాధిత తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు కళాశాల వద్దకు చేరుకుని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. కళాశాల యాజమాన్య తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. కాగా ఆ విద్యార్థిని బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.


హేమశ్రీ (ఫైల్ ఫొటో)

తనపల్లె పద్మగిరి కొండపై ఆక్రమణ..!


ఆక్రమితస్థలంలో నిర్మించిన రేకుల షెడ్డు

తిరుపతిరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): నల్లమానుకాలువ లెక్కదాఖలా తనపల్లెగ్రామ సర్వేనంబరు12లోని పద్మగిరికొండ(దండాయుదపాణిస్వామి ఆలయం)కు సంబంధించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారు. రాత్రికిరాత్రే రేకులషెడ్డు నిర్మించారు. కొండపైకి వేళ్లే దారిలో అదను చూసి శనివారం రాత్రే సిమెంటురాళ్లతో షెడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఆదివారం ఉదయం ఆ అక్రమ నిర్మాణానికి రేకులతో పైకప్పు వేసేశారు. గతంలో ఈకొండకి సంబంధించిన 80ఎకరాలను గ్రామస్తులు దేవదాయశాఖకు అప్పగించారని తెలిసింది. ఆశాఖ అధికారులు స్వాధీనపరచుకోకపోవడంతో గ్రామస్తులే ఆలయంలో స్వామివారి సేవలు, పాలనా వ్యవహారాలను చేపడుతున్నారు. ఆలయం అభివృద్ధి చెందుతున్న క్రమంలో కొండపై ఆక్రమణలు జరుగుతుండడంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా రాజగోపురానికి భూమిపూజ

● టీటీడీలో విలీనం చేసుకోవాలని వినతి


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్, ఆలయ ధర్మకర్త రమేష్

నింద్ర, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నింద్రలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న రాజగోపురానికి ఆదివారం భూమిపూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నింద్ర గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్ ఎమ్మెల్యేకు ఆలయ పూర్వ వైభవాన్ని, విశిష్టతను వివరించారు. ఆలయం శిథిలమైన తరువాత అదే స్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి నింద్ర గ్రామానికి చెందిన బలిజ సంఘం వారు కూడా నగదు అందించారు. భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

నడకతో ఫలితాలను ప్రచారం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నడకతో లభించే ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు, రీజనల్ కౌన్సిలర్ అర్కాట్ కృష్ణ ప్రసాద్ కోరారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు నడక ఎంత అవసరమనే విషయాలను వాకర్స్ సభ్యులు ప్రజలకు వివరించాల్సిన అవసరముందన్నారు. దైనందిక జీవితంలో నడకను అలవరుచుకోవాలన్నారు. అనంతరం అస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి యాజమాన్యం సభ్యులకు బీపీ మీటర్‌ను అందజేశారు. గవర్నర్ మాధవనాయుడు, రామచంద్రారెడ్డి, రవిరాజు, మనోహరన్, వినాయగన్, వేణుగోపాల్‌రాజు, ప్రతాప్, మునికృష్ణ, సుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అభినయ్ ప్రచారం బాధాకరం

తిరుపతి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్తకుప్పలు పేరుకుపోయాయని మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుందరయ్యనగర్‌లోని ట్రాన్సిట్ పాయింట్ వద్ద ఉన్న చెత్తతో ఫొటోలకు పోజులిచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం బాధాకరమని తెలిపారు. పగలు వీదుల్లో సేకరించిన వ్యర్థాలను ట్రాన్సిట్ పాయింట్‌కు తరలించి, రాత్రివేళలో డంపింగ్ యార్డ్‌కు చేర్చడం నిత్యం జరిగే పనేనని వివరించారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర గురించి మాట్లాడే అర్హత అభినయ్‌కి లేదని విమర్శించారు. వైసీపీ పాలనలో నగరంలో పారిశుధ్యం ఎలా ఉందో ప్రజలకు తెలుసునని గుర్తు చేశారు. గత నెలలో స్వచ్ఛ సూపర్‌లీగ్‌లో తిరుపతి ప్రెసిడెన్షియల్ అవార్డును గెలుచుకున్న విషయాన్ని అభినయ్ మరిచినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. పూటకో వేషంతో సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయడం అభినయ్ మానుకోవాలని హితవుపలికారు. ఎన్నికల సమయంలో పారిశుధ్య కార్మికుల పేరుతో టీటీడీ నిధులను కొల్లగొట్టే ప్రయత్నాలను కూటమి నేతలు అడ్డుకున్నారన్న అక్కసుతో ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

రోడ్డుపై మురుగు నీరు



తిరుపతి(గాంధీరోడ్డు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీపీపీఎం స్కూల్ ప్రధాన ద్వారం ఎదురుగా విష్ణునివాసం ప్రహరీని ఆనుకుని ఉన్న డ్రైనేజీ కాలువలోని మురుగునీరు సక్రమంగా ముందుకు కదలక రోడ్డుపైకి చేరింది. డ్రైనేజీ కాలువ చిన్నగా ఉండటంతో తరచూ మురుగునీరు రోడ్డుపైకి చేరుతోందని స్థానికులు అంటున్నారు. నీరు రహదారి మొత్తం విస్తరించడంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, శ్రీవారిని దర్శించుకునే యాత్రికులు, వాహన చోదకులు, స్థానికులు ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీగా ఉంటుంది. ఈ మురుగు నుంచి వచ్చే దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని వెళుతున్నారు. వేగంగా ప్రయాణించే వాహనాల నుంచి ఈ నీరు ఎగిరి పాదచారులపై పడుతుండడంతో ఇబ్బందిపడుతున్నారు. డ్రైనేజీ కాలువకు మరమ్మతులు చేపట్టి మురుగు నీరు ముందుకు పారేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మా అమ్మ మృతి

● బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు
● విచారణకు ఆదేశించిన కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో తన తల్లి మృతి చెందిందంటూ అరవసాయి రామ్ కృపాలనీ ఆదివారం అలిపిరి పోలీసులకు, కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. వెంకటగిరికి చెందిన అరవ సాయి రామ్ క్రుపాలనీ లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో క్లర్కుగా పని చేస్తున్నారు. ఇతడి తల్లి సుగుణమ్మ మే 9న ఇంట్లో పడటంతో ఎంప్లాయిస్ హెల్త్ స్కీము కింద వైద్యం ఇప్పించడం కోసం మాధురి రెమిడీ ఆసుపత్రిలో చేర్పించారు. 'ఈ చికిత్సకు డాక్టర్లు ఈహెచ్ఎస్ కింద వచ్చే డబ్బుకు అదనంగా రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.85,000 తీసుకున్నారు. మే 16న తొడ ఎముక సర్జరీ చేశారు. ఆ సమయంలో ఫీమర్ ఫ్రాక్చర్ అయిన విషయం చెప్పలేదు. మే 30న సరైన శస్త్ర చికిత్స లేకుండానే క్లోజ్డ్ రిడక్షన్ ప్రొసీజర్ కోసం రూ 20,000 అడిగి.. రూ.10 వేలు తీసుకున్నారు. సర్జరీ ఫెయిల్ కావడంతో తొడలో ఆపరేషన్ చేసి పెట్టిన రాడ్ సరిగా సెట్‌కాక ఇన్‌ఫెక్షన్ అయింది.

అక్కడ నుంచి రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఇన్‌ఫెక్షన్ శరీరమంతా వ్యాపించి జూలై 8న సుగణమ్మ మరణించిందంటూ రామ్ కృపాలనీ ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కూ ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. రుయా ఆర్థోపెడిక్ డాక్టర్ డి.ఎల్.వెంకటేష్ విచారించారు. దీనిపై మాధురీ రెమిడీ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న ఎం.ఎం.కుమార్‌కు ట్రీటింగ్ సర్జన్‌గా పనిచేసే అర్హత లేదని, అయినా డాక్టర్ కీర్తి చంద్ర పేరుతో శస్త్ర చికిత్సలు చేసినట్లు విచారణ నివేదికలో పొందుపరిచారు.

డాక్టర్ కీర్తి చంద్రిక ఈ శస్త్ర చికిత్సతో తనకు సంబంధం లేదని రాత పూర్వకంగా తెలిపారు. జరిగిన సర్జరీపై కూడా ఈహెచ్ఎస్ క్లెయిమ్ కోసం ఎక్స్‌రేలు, ఫొటోలు మోసపూరితంగా మార్చి సమర్పించడంతో ప్రభుత్వం హెల్త్ క్లెయిమ్‌ను రిజెక్టు చేసిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు మాధురీ రెమిడీ ఆసుపత్రి వైద్యులు ఎం.ఎం.కుమార్, కీర్తి చంద్ర, నిర్వాహకురాలిపై అలిపిరి ఎస్ఐ అజిత కేసు నమోదు చేశారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని ఫంక్షన్‌హాల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జ్ పి.షణ్ముగం మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని, బీసీ మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, కేంద్ర క్యాబినెట్‌లో చోటివ్వాలని, వెనుకబడిన వర్గాల జనాభా లెక్కలు సత్వరం చేపట్టాలనే డిమాండ్లపై ఈనెల 18, 19 తేదీల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు, జోష్ ప్రాపర్టీస్ అధినేత ఈశ్వరప్రకాష్, జిల్లా అధ్యక్షుడు తురుక అమర్నాథ్, కొండా రామారావు, జ్ఞానశేఖర్, రవి, శరవణ, సందీప్, వెంకష్, కిషోర్ పాల్గొన్నారు.

ఒకటిన పెన్షన్ మార్చ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చీర్ల కిరణ్ తదితరులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాలుగు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు పెన్షన్ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై సెప్టెంబరు 1న పెన్షన్ మార్చ్ నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్‌ఈ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఇచ్చే సామాజిక పింఛన్‌లో సగం కూడా 30 నుంచి 40 ఏళ్లపాటు సర్వీసు చేసిన ప్రభుత్వ ఉద్యోగికి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని పోరాటాలు చేస్తుంటే ఈజీపీఎస్ పేరుతో మభ్యపెట్టాలని చూడటం బాధాకరమని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా దాని గురించి పట్టించుకోలేదని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ఐఆర్, డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంకీపురం పవన్, రామచంద్ర, శ్రీనివాసులు, చలపతి పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి మాతృవియోగం

- పలువురి సంతాపం
- నేడు గోవిందధామంలో అంత్యక్రియలు



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డి తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందారు. ఆమె కొంతకాలంగా వృద్ధాప్య, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శాంతినగర్‌లోని భానుప్రకాష్‌రెడ్డి స్వగృహంలో అరుణమ్మ భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, భాగ్యనగరం శేఖర్‌రెడ్డి, తుడా వెంకటరెడ్డి, పసుపులేటి సురేష్‌రాయల్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర, అన్నా రామచంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి - కరకంబాడి మార్గంలోని గోవిందధామంలో దహనక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అండర్- 22 బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల రద్దు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీన జరిగిన అండర్ 22 బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలను రద్దు చేస్తున్నట్లు శాప్ ప్రకటించడంతో గందరగోళం నెలకొంది. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పది క్రీడాంశాలలో 6, 7 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే జూనియర్స్‌కు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో అండర్-22 షటిల్ బాడ్మింటన్‌ను రద్దు చేసి అండర్ 19కే పరిమితం చేసి పోటీలు మళ్లీ నిర్వహించాలని శాప్ అన్ని జిల్లాల క్రీడాధికారులను ఆదేశించింది. ఈ మేరకు 13న శ్రీనివాస క్రీడా సముదాయంలో పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ తెలిపారు.కాగా ఇప్పటికే అండర్22విభాగంలో జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తీవ్రనిరాశకు గురయ్యారు.

ఆత్మీయ సన్మానం

తిరుపతి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కొర్లగుంట సంజీవ్‌గాంధీకాలనీలోని శ్రీబాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లకుప్పం శేఖర్‌కు ఆదివారం ఘన సన్మానం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను సన్మానించుకోవడం సంతృప్తిగా ఉందని యూనియన్ ఫౌండర్ తంగవేలు మేస్త్రి అన్నారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అల్లాబక్ష, రమణ, జగన్నాథ, మధు మాదవ్, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ముడి ఆహార పదార్థాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న యోగా శిక్షకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ముడి ఆహార పదార్థాలు తీసుకుని ఆరోగ్యంగా ఉందామని పతాంజలి యోగా ప్రతినిధి కైలాష్‌సింగ్‌రాజ్‌పురోహిత్, నగరానికి చెందిన యోగా గురువు రఫీ హిందూస్తానీ అన్నారు. స్థానిక మంచినీళ్లగుంట వెనుక ఉన్న విద్యోదయ స్కూల్ ఆవరణలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం అమృత ఆహారం(రా ఫుడ్)పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సహజసిద్ధంగా పండే ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, గింజలు, బూడిద గుమ్మడికాయలతో పెరుగన్నం, బీట్రూట్ హల్వా, కూరగాయలతో జిలేబీలు తయారు చేసుకుని తింటే ఆయుష్షు పెరుగుతుందన్నారు. మాంసాహారం వీలైనంత వరకు తగ్గించాలని సూచించారు. రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధికమించవచ్చని వివరించారు.

బాంద్ర టెర్మినల్ - వేలాంకన్ని మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ముంబయిలోని బాంద్ర టెర్మినల్ తమిళనాడులోని వేలాంకన్ని మధ్య ఈనెల 27, సెప్టెంబరు 6 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. వేలాంకన్నిలో మేరీమాత ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బాంద్రలో ఈ ప్రత్యేక రైలు(09093) ఈనెల 27న రాత్రి 9.40 గంటలకు బయలుదేరి బోరివాలి, వాసైరోడ్డు, పాన్‌వేల్, లోనావాలా, పూణే, డోండ్, షోలాపూర్, కాలాబురాగి, వాడి, యాదగిర్, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, మైలాడుతురై, నాగపట్టణం మీదుగా వేలాంకన్నికి రెండవ రోజు ఉదయం 7.40 గంటలకు చేరుకుంటుంది. వేలాంకన్నిలో ఈ ప్రత్యేక రైలు(09094) ఈనెల 30వ తేదీ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ రెండవ రోజు ఉదయం 10.30 గంటలకు బాంద్రా చేరుకుంటుందని వివరించారు. 2ఏసీ, 3ఏసీ, సెకండ్ స్లీపర్, సాధారణ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

శంకరంబాడికి ఘన నివాళి



శంకరంబాడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న భాషా, సాహిత్య సంఘాల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మా తెలుగు తల్లికి మల్లెపూదండ పాట రచయిత శంకరంబాడి సుందరాచారికి తిరుపతి జిల్లా రచయితల సంఘం, రాయలసీమ రంగస్థలి, వేమన విజ్ఞాన కేంద్రం, శంకరంబాడి పీఠం వేర్వేరుగా నివాళి అర్పించాయి. శంకరంబాడి జయంతి సందర్భంగా లక్ష్మీపురం కూడలిలోని శంకరంబాడి విగ్రహానికి ఆయా సంస్థల ప్రతినిధులు పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ తిరుపతికి చెందిన శంకరంబాడి రాసిన మా తెలుగుతల్లికి గేయం జాతి జనులు పాడుకునేలా ఖ్యాతికెక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, అరసం జిల్లా కార్యదర్శి యువశ్రీ మురళి, టెంకాయల దామోదరం, వాకాప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, ఏనుగు అంకమనాయుడు, మల్లారపు నాగార్జున, కసిరెడ్డి లలితమ్మ, కవి ఎన్.ధర్మయ్య, డాక్టర్ నాగలూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం రైల్వే కోడూరుకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి, అక్కడి నుంచి 11.20 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ కాసేపు అధికారులు, నాయకులతో చర్చించి, రైల్వే కోడూరుకు వెళతారు. మళ్లీ మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి సాయంత్రం మూడు గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు వెళతారు.

ప్రశాంత జీవకోన ప్రభుత్వ లక్ష్యం

పోలీసు, ఫారెస్టు అవుట్ పోస్టు భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ఎస్పీ



పోలీసు, ఫారెస్టు అవుట్ పోస్టు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన జీవకోన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద పోలీసు, ఫారెస్టు అవుట్ పోస్టు నూతన భవనాన్ని ఎస్పీ హర్షవర్ధన రాజు, డీఎఫ్‌వో వివేక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవకోనలో అసాంఘిక కార్యకలాపాల నివారణకు గతంలో తాత్కాలిక అవుట్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణ సొంతంగా రూ.4లక్షలతో నూతన భవనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి జేఎంసీ ట్రస్టు ద్వారా రెండు ఆర్వో మినరల్ వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేగాక ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా కార్యక్రమం ద్వారా జీవకోన ప్రాంతంలో అనేక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జీవకోనలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టి, సురక్షితమైన ప్రాంతంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే 125 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. జీవకోన ప్రజల సౌకర్యార్థం అవుట్‌పోస్టు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఏఎస్పీ రవి మనోహాచారి, డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ లోకేష్‌కుమార్, కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, దూది కుమారి, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధుల పరిష్కారమే లక్ష్యం

ముగిసిన అప్సా రాష్ట్ర సదస్సు



వైద్య విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రేమానంద్, సుబ్బారావు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పల్మనాలజిస్టులు నిత్య వైద్య విద్యార్థులుగా ఉంటూ నివారణకు కృషి చేయాలని అప్సా(ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్) ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అప్సా 6వ వార్షికోత్సవ సదస్సు ఆదివారం ముగిసింది. వారు మాట్లాడుతూ పల్మనరీ విభాగంలో వస్తున్న ఆధునిక వైద్య పద్ధతులు, మెళకువలు, అనుభవాలను పంచుకోవడంతోపాటు నేర్చుకునే అవకాశం ఇలాంటి సదస్సుల ద్వారా కలుగుతుందని తెలిపారు. తద్వారా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్ ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ, డాక్టర్ సుబ్బారావు అండర్‌స్టాండింగ్ లేటెంట్ టీబీ, డాక్టర్ రఘు పార్టర్ రెజిమెన్స్, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యన్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ఇన్ ట్యూబర్క్యులోసిస్ అంశాల గురించి వివరించారు. ప్రముఖ పల్మనాలజిస్టులు ఊపిరితిత్తుల వ్యాధులపై చేసిన పరిశోధన పత్రాలను సమర్పించారు. పల్మనరీ విభాగంలోని నూతన ఆవిష్కరణలు, అధునాతన వైద్య పరికరాలు, వైద్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ పరిశోధనా పత్రాలను అందించిన పీజీ వైద్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ప్రముఖ వైద్య నిపుణులు విజయ్, హరికృష్ణ, సునీల్‌కుమార్, సురేంద్ర, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'కృష్ణం వందే జగద్గురుమ్'

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన కృష్ణం వందే జగద్గురుమ్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అన్నమయ్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్కృత యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కంభంపాటి సాంబశివమూర్తి మాట్లాడుతూ మానవ జీవన మార్గాన్ని భగవద్గీత ఉపదేశిస్తుందన్నారు. అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు భగవద్గీత పరిష్కారాలను చూపిస్తుందన్నారు. నేషనల్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ తెలుగు, సంస్కృత భాషలకు సంబంధించిన గొప్ప విశేషాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వాగ్వర్ధిని పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ భరత్‌భూషణ్‌రథ్ మాట్లాడుతూ గీతా సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రముఖ జ్యోతిష్య పండితుడు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఈ కార్యక్రమ లక్ష్యాన్ని వివరించారు. ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.కుమార్ వ్యవహరించారు. వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు శ్రీకృష్ణ నృత్య ప్రదర్శన, గీతా పారాయణం చేశారు. తద్వారా ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పాల్గొన్న వారికి నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పుత్తూరు వార్తలు

చెంచులక్ష్మీ సేవలో భానుప్రకాష్



వడమాలపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాదిరేడు భద్రప్పనాయుడు ఎస్టీకాలనీలో కొలువై ఉన్న చెంచులక్ష్మి అమ్మవారిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఆదివారం విచ్చేసిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామంలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పిస్తామని చెప్పారు.

మహిళ మెడలో చైన్ దోపిడీ

వడమాలపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పొలం నుంచి ఇంటికి వెళ్తున్న మహిళను అడ్డగించి బంగారు చైన్ లాక్కెళ్లారు. వడమాలపేట పంచాయతీ అక్కీపురానికి చెందిన కన్నమ్మ ఆదివారం సాయంత్రం సమీపంలోని పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన దుండగుడు చిరునామా అడుగుతూ ఆమె మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు గొలుసు లాక్కెల్లాడు. ఈ పెనుగులాటలో కన్నెమ్మ చెయ్యి విరిగింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కల్పవృక్ష వాహనంపై ద్రౌపదిదేవి దర్శనం



పుత్తూరు టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి ఆలయ వార్షిక మహాభారత ఉత్సవాల్లో ఆదివారం ద్రౌపదిదేవి కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కల్పవృక్ష వాహనంపై అమ్మవారు పట్టణంలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం ఆలయంలో భక్తులు కంకణాలు ధరించారు. పట్టణంలోని మంచి నీళ్లగుంట వద్ద అగ్ని గుండాన్ని ఏర్పాటు చేశారు. గుంటలో స్నానమాచరించి, గంధం, పసుపు పూసుకుని పసుపు వస్త్రాలు ధరించి, తలకు పసుపు పువ్వులను చుట్టుకుని గోవిందా, గోవిందా అంటూ వేపాకు మండలను చేతిలో పట్టుకుని అగ్నిగుంట ప్రవేశం చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎస్.ప్రతాప్ రాజు ఆధ్వర్యంలో అగ్నిగుండ మహోత్సవం జరిగింది.

సారథ్యం సభను విజయవంతం చేయండి

రేణిగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సారథ్యం సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి, ఆ పార్టీ మండల ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి కార్యకర్తలతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో ఈనెల 12న సారథ్యం యాత్ర తిరుపతిలో జరుగుతుందని, పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రేణిగుంట జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని హెడ్‌కానిస్టేబుల్ గౌరీ శంకర్ తెలిపారు. రైల్వే కోడూరు - అనంతరాజపేట మధ్య రాచపల్లి రైల్వే గేటు వద్ద సుమారు 60 సంవత్సరాల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహంపై తెల్లషర్టు, పంచె ఉన్నాయన్నారు. మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భానుప్రకాష్‌రెడ్డికి మాతృవియోగం

పలువురి సంతాపం ● నేడు గోవిందధామంలో అంత్యక్రియలు



భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శిస్తున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నేత భానుప్రకాష్‌రెడ్డి తల్లి గుడుపల్లి అరుణమ్మ (80) ఆదివారం మృతిచెందారు. ఆమె కొంతకాలంగా వృద్ధాప్య, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శాంతినగర్‌లోని భానుప్రకాష్‌రెడ్డి స్వగృహంలో అరుణమ్మ భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, భాగ్యనగరం శేఖర్‌రెడ్డి, తుడా వెంకటరెడ్డి, పసుపులేటి సురేష్‌రాయల్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, నరేంద్ర, అన్నా రామచంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి - కరకంబాడి మార్గంలోని గోవిందధామంలో దహనక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

బాంద్ర టెర్మినల్ - వేలాంకన్ని మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): బాంద్ర టెర్మినల్ తమిళనాడులోని వేలాంకన్ని మధ్య ఈనెల 27, సెప్టెంబరు 6 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. వేలాంకన్నిలో మేరీమాత ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బాంద్రలో ఈ ప్రత్యేక రైలు(09093) ఈనెల 27న రాత్రి 9.40 గంటలకు బయలుదేరి బొరివాలి, వాసైరోడ్డు, పాన్‌వేల్, లోనావాలా, పూణే, డోండ్, షోలాపూర్, కాలాబురాగి, వాడి, యాదగిర్, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం, మైలాడుతురై, నాగపట్టణం మీదుగా వేలాంకన్నికి రెండవ రోజు ఉదయం 7.40 గంటలకు చేరుకుంటుంది. వేలాంకన్నిలో ఈ ప్రత్యేక రైలు(09094) ఈనెల 30వ తేదీ శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ రెండవ రోజు ఉదయం 10.30 గంటలకు బాంద్రా చేరుకుంటుందని వివరించారు. 2ఏసీ, 3ఏసీ, సెకండ్ స్లీపర్, సాధారణ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మండల కమిటీ

రేణిగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నూతన మండల కమిటీని ప్రకటించారు. మామండూరులో ఇంటింటా భజన మా ఇంట భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త మునిరాజా ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మునిశంకర్ నేతృత్వంలో మండల కమిటీని ప్రకటించారు. గౌరవ సలహాదారుడిగా కాలప్ప, గౌరవ అధ్యక్షుడిగా విజయబాబు, మండల అధ్యక్షుడిగా శ్రీనివాసుల నంద, కార్యదర్శిగా కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు.

గూడూరు సూళ్లూరుపేట/వెంకటగిరి

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కండి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న గంగాప్రసాద్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండెపాటి గంగాప్రసాద్ అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ అధ్యక్షతన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు నాయుడుపేట పట్టణ, మండల, పెళ్లకూరు, ఓజిలి మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, అన్నదాత సుఖీభవ, పింఛన్లు, తల్లికి వందనం, సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు గురించి సమీక్షించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచితస్థానం లభిస్తుందన్నారు. ఒకే పదవికి పోటీ ఎక్కువగా ఉన్న పక్షంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్టీకి అందరూ సమానమేనని ఎక్కువ తక్కువలు ఉండవన్నారు. చిన్నచిన్న మనస్పర్థలు ఉంటే కలిసి మాట్లాడుకొని పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో నెలవల రాజేష్, అరవపెరిమిడి చంద్రారెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, దార్ల రాజేంద్ర, షైలారి రాజశేఖర్, నానాబాల సుబ్బారావు, గంగాప్రసాద్, సంచి కృష్ణయ్య, మురళీరెడ్డి, రమేష్ నాయుడు, దారా అంకయ్య, సుజాతమ్మ, కన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోలకు అధ్యక్షుల నియామకం



బాలాయపల్లి: సింగిల్ విండోల అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు, భాస్కర్‌రావు, సత్యం నాయుడు, ప్రభాకర్, ఆది వెంకటకృష్ణారెడ్డి

బాలాయపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలంలో ఐదు సింగిల్ విండోలకు అధ్యక్షలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బాలాయపల్లి సొసైటీ అధ్యక్షుడిగా రాయి సత్యం నాయుడు, జయంపు సొసైటీ అధ్యక్షుడిగా సింగంశెట్టి భాస్కర్ రావు, భైరవరం సొసైటీ అధ్యక్షుడిగా దాసరి ప్రభాకర్ నాయుడు, నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడిగా ఆదివెంకటకృష్ణారెడ్డి, యాచవరం సొసైటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్ నాయుడు నియమితులయ్యారు.

ఓజిలి: మండలంలోని కుందాం, కురుగొండ సొసైటీలకు అధ్యక్షులను ప్రభుత్వం నియమించింది. కుందాం సొసైటీ అధ్యక్షుడిగా ఆరిమేనిపాడుకు చెందిన గుంటమడుగు పురుషోత్తంరాజు, కురుగొండ సొసైటీ అధ్యక్షుడిగా కురుగొండకు చెందిన దారా అంకయ్య నియమితులయ్యారు. అలాగే కుందాం సొసైటీ డైరెక్టర్లుగా కుందాం గ్రామానికి చెందిన పి.బాలగురునాథం, అత్తివరానికి చెందిన ఎల్లు వెంకటయ్య, కురుగొండ సొసైటీ డైరెక్టర్లుగా ఓజిలికి చెందిన ఏ.మల్లిఖార్జున్‌రెడ్డి, రాచపాళెం గ్రామానికి చెందిన ఎం.రవీంద్రరాజును నియమించారు.

వెంకటగిరి: మండలంలోని వెంకటగిరి, లాలాపేట, యాతలూరు సింగిల్ విండోలకు అధ్యక్షలను ప్రభుత్వం నియమించింది. వెంకటగిరి సొసైటీ అధ్యక్షుడిగా పప్పు చంద్రమౌళిరెడ్డి, లాలాపేట సొసైటీ అధ్యక్షుడిగా గొల్లగుంట వెంకటముని, యాతలూరు సొసైటీ అధ్యక్షుడిగా గుత్తికొండ బాబురావు నియమితులయ్యారు.



ఓజిలి: పురుషోత్తంరాజు, అంకయ్య - వెంకటగిరి: పప్పు చంద్రమౌళిరెడ్డి, వెంకటముని, బాబురావు

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలో పనిచేసేందుకు ఆన్‌కాల్ డ్రైవర్లు కావాలని డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. హెవీ లైసెన్స్, 18 నెలల అనుభవం, అభ్యర్థి వయస్సు 55 ఏళ్ల లోపు ఉండాలన్నారు. అర్హత ఉన్న వారు పూర్తి వివరాలతో డిపోలో సంప్రదించాలని కోరారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

తడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు తడలో ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో సుస్థిరమైన ప్రభుత్వం కొలువుతీరడంతో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం అమలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేజారెడ్డి, నాయకులు జ్యోతి, రమేష్, చెంచయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గూడూరు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు

వాకాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు కల్లూరు హరీష్ నాయుడు జన్మదిన వేడుకలను వాకాడు, నెలిపూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. హరీష్ నాయుడు కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఆయనను టీడీపీ నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆగమోక్తంగా నీలకంఠేశ్వరుడి కల్యాణం



పట్టువస్త్రాలను తీసుకెళుతున్న ఈవో బాపిరెడ్డి తదితరులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఆగమోక్తంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం మేళతాళాలు, వేదమంత్రోచ్చరణల నడుమ ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి స్వామి అమ్మవార్లకు ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు.

డీఐజీకి ఎమ్మెల్యేల పరామర్శ



గోపీనాథ్ జెట్టిని పరామర్శిస్తున్న గంగాప్రసాద్, కురుగొండ్ల, పాశం

ఓజిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలుకు చెందిన డీఐజీ గోపీనాథ్ జెట్టిని ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్ పరామర్శించారు. గోపీనాథ్ తండ్రి జెట్టి పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం గ్రామంలో నిర్వహించిన కర్మక్రియలకు ఎమ్మెల్యేలు హాజరై పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, ఎస్కే ఖలీల్ తదిరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక టిడ్కో గృహాల వద్ద పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధుల పరిష్కారమే లక్ష్యం

ముగిసిన అప్సా రాష్ట్ర సదస్సు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పల్మనాలజిస్టులు నిత్య వైద్య విద్యార్థులుగా ఉంటూ నివారణకు కృషి చేయాలని అప్సా(ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్) ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అప్సా 6వ వార్షికోత్సవ సదస్సు ఆదివారం ముగిసింది. వారు మాట్లాడుతూ పల్మనరీ విభాగంలో వస్తున్న ఆధునిక వైద్య పద్ధతులు, మెళకువలు, అనుభవాలను పంచుకోవడంతోపాటు నేర్చుకునే అవకాశం ఇలాంటి సదస్సుల ద్వారా కలుగుతుందని తెలిపారు. తద్వారా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్ ఎక్స్‌ట్రా పల్మనరీ టీబీ, డాక్టర్ సుబ్బారావు అండర్‌స్టాండింగ్ లేటెంట్ టీబీ, డాక్టర్ రఘు షార్టర్ రెజిమెన్స్, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యన్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ఇన్ ట్యూబర్కులోసిస్ అంశాల గురించి వివరించారు. ప్రముఖ పల్మనాలజిస్టులు ఊపిరితిత్తుల వ్యాధులపై చేసిన పరిశోధన పత్రాలను సమర్పించారు. పల్మనరీ విభాగంలోని నూతన ఆవిష్కరణలు, అధునాతన వైద్య పరికరాలు, వైద్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఉత్తమ పరిశోధనా పత్రాలను అందించిన పీజీ వైద్య విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ప్రముఖ వైద్యులు విజయ్, హరికృష్ణ, సునీల్‌కుమార్, సురేంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమణ సూచించారు. ఆదివారం స్థానిక వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న టిడ్కో గృహాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా డ్రోన్ ద్వారా నిఘా పెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో సేవిస్తున్నారని సమాచారం అందడంతో డ్రోన్ ద్వారా నిఘా పెట్టి పట్టుకుని శిక్షిస్తున్నామన్నారు. టిడ్కో గృహాలు దూరంగా ఉన్నందున రాత్రి పూట ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే 100 నంబరుకు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

గణేశ్ మండపాల ఏర్పాటు, విగ్రహప్రతిష్ఠ చేయాలంటే తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, రాత్రి 10గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. ఇతర మతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు భరోసా కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగ్గాలు నేసే చేనేతలకు నెలకు 200యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, కటికాల శ్రీనివాసులు, పడాల రత్నయ్య, రవీంద్రరెడ్డి, శ్యామల, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయ కుంభాభిషేకం



సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

కోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సంగమేశ్వరాలయంలో మూడు రోజులపాటు జరిగే కుంభాభిషేకాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న కామాక్షీదేవి విగ్రహాన్ని తొలగించి, దానిస్థానంలో నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేందుకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మేళతాళాలతో కుంభాభిషేకాలకు అంకురార్పణ జరిగింది.

కేశవరంలో మల్లికార్జునస్వామి విగ్రహప్రతిష్ఠ



ఆలయ ప్రాంగణంలో ఊరేగింపునకు సిద్ధంగా ఉన్న కలశాలు, హోమాలు

కోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరంలో గల శివతోటలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి మహా కుంభాభిషేకాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల విగ్రహాలతో గ్రామోత్సవం జరిగింది. యాగశాలలో దీక్షా హోమాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా రాజగోపురానికి భూమిపూజ

టీటీడీలో విలీనం చేసుకోవాలని వినతి



భూమిపూజలో ఎమ్మెల్యే భానుప్రకాష్, ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్

నింద్ర, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నింద్రలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న రాజగోపురానికి ఆదివారం భూమిపూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నింద్ర గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్త ఆర్వేల రమేష్ ఎమ్మెల్యేకు ఆలయ పూర్వ వైభవాన్ని, విశిష్టతను వివరించారు. ఆలయం శిథిలమైన తరువాత అదేస్థానంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషిచేయాలని కోరారు. ఈ ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని రమేష్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి నింద్ర గ్రామానికి చెందిన బలిజ సంఘం వారు కూడా నగదు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య?

నెల్లూరులోని కళాశాల ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళన

నెల్లూరు(క్రైం)/ సత్యవేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న ప్రైవేటు కళాశాలలో ఆదివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాలెంనకు చెందిన పి.తిరుమల, వేదవతి కుమార్తె హేమశ్రీ(16). ఆమె ఈ ఏడాది జూన్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చేరింది. హాస్టల్‌లోనే ఉండి చదువుకుంటోంది. కొంతకాలంగా చదువుల్లో ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని, మరో సెక్షన్‌కు మార్చాలని కళాశాల సిబ్బందిని అడుగుతూ ఉండేది. ఈక్రమంలో ఈనెల 9న రాత్రి హేమశ్రీ తల్లిదండ్రులకు ఫోన్‌చేసి తాను చాలా ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. ఆదివారం ఉదయం కూడా తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసింది. ఏం జరిగిందో ఏమో హేమశ్రీ అనారోగ్యానికి గురవడంతో సమీపంలోని వైద్యశాలలో చేర్పించామని, పరిస్థితి విషమయంగా ఉందని హాస్టల్ సిబ్బంది ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. వారు హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని చూడగా కుమార్తె చనిపో యింది. దీంతో వారు గుండెలవిసేలా విలపించారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు కళాశాల వద్దకు చేరుకొని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. కళాశాల యాజమాన్య తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు కళాశాల వద్దకు చేరుకుని బాధిత తల్లిదండ్రుల నుంచి వివరాలను సేకరించారు. కాగా ఆ విద్యార్థిని బాత్‌రూంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.


హేమశ్రీ (ఫైల్‌ఫొటో)

రోడ్డుప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి దళితవాడకు చెందిన జయరామయ్య లారీడ్రైవర్ (35) డ్రైవర్. సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆదివారం ఇంటి నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పొయ్య వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జయరామయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తొట్టంబేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ముగ్గురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, ఆటో

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద ఆదివారం జరిగింది. ఏర్పేడు మండలంలో బేకరీ నిర్వహించే పుష్ప, అదే మండలం మోదుగులపాళెంకు చెందిన రావమ్మ, శ్రీకాళహస్తి మండలం అక్కుర్తికి చిన్నరెడ్డెమ్మ ముగ్గురు వేర్వేరుగా సొంత పనుల నిమిత్తం శ్రీకాళహస్తికి వచ్చారు. తిరిగి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో రాచగున్నేరి సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురుని స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.

బంగారం చోరీ కేసులో నలుగురి అరెస్టు

● 12 గ్రాముల చైను, రెండు కార్ల స్వాధీనం

నాగలాపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బంగారు దుకాణంలో చైను చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. జూలై 19వ తేదీ నాగలాపురం బజారు వీధిలోని మహావీర్ బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలుకు వచ్చి 12 గ్రాముల చైను అపహరించుకుని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక బైపాసు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి విచారించి బంగారు చైను, రెండు కార్లను స్వాధీనం చేసుకురు. ఈ మేరకు నిందితులు అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం చింతలపల్లి పంచాయతీకి చెంది వేముల జ్యోతి(35), ఆమె భర్త వేముల నరేష్(37), వేముల నరసమ్మ(35), ఆమె భర్త వేముల తిమ్మయ్య(36)ను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ట్రైనీ ఎస్‌ఐ ప్రసాద్, కానిస్టేబుల్ సాయికృష్ణ, హోంగార్డు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఏర్పేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వామనం ఢీకొని యువకుడు మృతి చెందినట్లు ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి దళితవాకడు చెందిన చంద్రయ్య, నవనీతమ్మ మూడో కుమారుడు నవీన్(25) శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం సమీపంలో ఉన్న కోకాకోలా పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు కుంటిపూడి నుంచి ఏర్పేడు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. దుర్గిపేరి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో నవీన్ అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏర్పేడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఇంతలో నవీన్ తల్లిదండ్రులు, బంధువులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నవీన్ (ఫైల్‌ఫొటో)

అప్పు చెల్లించమని అడిగినందుకు దాడి

శ్రీకాళహస్తి,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తాను హామీ ఉండి బ్యాంకు నుంచి తీసిచ్చిన అప్పును చెల్లించమని అడిగినందుకు యువకుడిపై దాడి జరిగింది. పిచ్చాటూరుకు చెందిన రఘు ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుంటాడు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ మహిళతో కొద్ది సంవత్సరాల క్రితంలో రేణిగుంటలో ఓ పరిశ్రమలో పనిచేసే సమయంలో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత ఇంటి వద్ద చిల్లర దుకాణం నిర్వహించుకని ఉపాధి పొందుతానని మహిళ రఘుతో చెప్పింది. ఆ మేరకు ఓ బ్యాంకు రఘు ష్యూరిటీ ఉండి రుణం తీసిచ్చాడు. ఏడాది నుంచి మహిళ ఈఎంఐ చెల్లించకపోవడంతో రఘును బ్యాంకు అధికారులు నిలదీశారు. దీంతో మహిళను అప్పు చెల్లించాల్సిందిగా కోరాడు. ఈ క్రమంలో పలుమార్లు వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈనెల 10న ఆదివారం బాకీ చెల్లిస్తానని రెండునెలల క్రితం కొందరు మధ్యవర్తుల ద్వారా మహిళ ఒప్పందం చేసుకుంది. దాంతో ఆదివారం రఘు, తన భార్య కోకిలను వెంటబెట్టుకుని పట్టణంలోని బహదూరుపేటలోని మహిళ ఇంటి వద్దకు వచ్చాడు. అప్పు చెల్లించమని అడగడంతో మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. అంతలో మహిళకు సంబంధించిన నలుగురు వ్యక్తులు రఘుపై దాడి చేశారు. చికిత్స నిమత్తం యువకుడు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

ధర్మరాజస్వామి సేవలో పలువురు ప్రముఖులు

ఏర్పేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో వారం రోజులుగా ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు ఎస్సీవీ దిలీప్, సత్రవాడ ప్రవీణ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

రేణిగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం సాయంత్రం అర్బన్ సీఐ జయచంద్ర పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. గంగమ్మ జాతరను పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని హెచ్చరించారు.

కలగా మిగిలిన చెన్నంపల్లి - నక్కలవంక వంతెన

వరద వస్తే ఐదు గ్రామాలకు మూడు నెలలు రాకపోకలు బంద్


పాపానాయుడుపేట నుంచి ఐదు గ్రామాలకు నక్కల వంకపై తాత్కాలిక రహదారి - వర్షాలకు కొట్టుకుపోయిన దారి(ఫైల్ ఫొటో)

ఏర్పేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆ ఐదు గ్రామాలు నక్కలవంక స్వర్ణముఖి నది తీరంలో ఉంటాయి. వర్షాకాలం వచ్చిందంటే స్వర్ణమ్మ ఉధృతంగా ప్రవహించి ఆ గ్రామాలకు మూడు నెలల పాటు రాకపోకలు నిలిచిపోతాయి. ఆ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు అత్యవసర సమయాల్లో ఎక్కడికైనా వెళ్లాలంటే నరకయాతనే. శాశ్వతంగా వంతెన నిర్మాణం చేపడితే తప్ప వారి కష్టాలు తీరవు. సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా ఐదు గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వంతెన నిర్మాణానికి భూమిపూజలు చేస్తున్నారే తప్ప పనులు చేపట్టడం లేదు.

ఏర్పేడు మండలంలోని చెన్నంపల్లి, పెనగడం, నార్లవారికండ్రిగ, పెనగడం ఎస్టీకాలనీ, కొత్త కాల్వ గ్రామాలకు పాపానాయుడుపేట నుంచి రహదారి ఉంది. ఈ రహదారిలో నక్కలవంక, స్వర్ణముఖి నది కలుస్తాయి. వర్షాకాలంలో గ్రామస్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న రోడ్డు కొట్టుకుపోతోంది. దీంతో ఐదు గ్రామాలకు మూడు నెలల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామీణ ప్రజలు నానా అవస్థలు పడు తున్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శాశ్వత వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతే... ఆ తరువాత పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా ప్రజాప్రతినిధులు. అధికారులు చొరవ తీసుకుని ఐదు గ్రామల ప్రజలకు ఇబ్బంది లేకుండా నక్కలవాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

వైసీపీ నేతల తీరుతో....

గత వైసీపీ ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.1.18కోట్లను మంజూరుచేసింది. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధు భూమిపూజ కూడా చేశారు. అయితే వైసీపీ నేతలు అధికంగా కమీషన్లు అడగడంతో సంబంధిత కాంట్రాక్టరు పనులు చేపట్టలేదనే ప్రచారం జరిగింది. వారి కారణంగానే బ్రిడ్జి నిర్మాణం జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన నిర్మించండి



నా వయసు 88 సంవత్సరాలు. నాకు తెలిసినప్పటి నుంచి మా గ్రామానికి వచ్చే రోడ్డుకు అడ్డంగా నక్కలవాగుపై బ్రిడ్జి లేదు. దీంతో ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వాలు మారుతున్నా మా బతుకులు మారడం లేదు. కూటమి ప్రభుత్వం ఆలోచించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

\- కమలమ్మ, పెనగడం

మేమే రోడ్డు ఏర్పాటు చేసుకుంటున్నాం



యేటా వర్షా కాలంలో రోడ్డు కొట్టుకుపోతోంది. అధికారులు తూతూమంత్రంగా పనిచేసి వెళ్లిపోతారు. ఆ తరువాత గ్రామస్తులందరూ తలా ఇంత వేసుకుని మట్టి పోసుకుని తూములు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నాం. భారీ వర్షాలకు ఆ వంతెన కొట్టుకుపోతే విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

\- వాసు, చెన్నంపల్లి

తంగేళ్లపాళెం సింగిల్‌విండో అధ్యక్షుడిగా భాస్కర్



శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాళెం సింగిల్ విండో అధ్యక్షుడిగా భీమాల భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తొట్టంబేడు గ్రామానికి చెందిన బీసీ సామాజికవర్గ టీడీపీ నేత భాస్కర్ సుదీర్ఘకాలం నుంచి పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సేవలందించాడు. అయన్ను సింగిల్‌విండో చైర్మన్‌గా ఎంపిక చేయడంపై బీసీ వర్గాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఏర్పేడు సింగిల్‌విండో అధ్యక్షుడిగా మహేష్‌రెడ్డి



ఏర్పేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సింగిల్‌విండో అధ్యక్షుడిగా అంజిమేడు గ్రామానికి చెందిన ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివ శంకర్‌రెడ్డి కుమారుడు కందాటి మహేష్‌రెడ్డిని ఎంపిక చేశారు. అదే విధంగా డైరెక్టర్లుగా నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలిగా ఉన్న గాలి కృష్ణవేణిని, మల్లిగుంట మునిశేఖర్‌ను ఎంపిక చేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం



ఏర్పేడు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ధర్మరాజస్వామి అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ శ్రీకాంత్‌రెడ్డి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 2వేలమంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పిచ్చాటూరులో...

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గొల్లకండ్రిగలో అంకాళపరమేశ్వరి ఆలయం ఎదుట ఆదివారం సాయంత్రం కంకణధారణ ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అంకాళపరమేశ్వరి ఆలయ తిరుణాళ్లలో భాగంగా చివరి రోజు ఆదివారం అమ్మవారికి అంబలి పోసి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. కంకణధారణ చేసి భక్తులు 9 బావుల్లో అభ్యంగన స్నానాలు చేసి పసుపు దుస్తులు ధరించి నిప్పు కణికలపై గోవిందా... గోవిందా... అంటూ అగ్నిగుండ ప్రవేశం చేశారు.

రైలు ఢీకొని కార్మికుడి మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వలస కార్మికుడు మృతి చెందాడు. ఉత్తర భారతదేశానికి చెందిన సచిన్‌సింగ్(23) శ్రీకాళహస్తి మండలంలోని ఇసుకగుంట వద్ద ఉన్న కూల్‌డ్రింక్స్ తయారీ పరిశ్రమలో కార్మికుడు. ఆదివారం విధులు ముగించుకుని పరిశ్రమ నుంచి సమీపంలోని గదికి బయలుదేరాడు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు కావడంతో కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 525 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,410, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,169మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,481 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 929, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 285, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 193, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 97మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,034 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.


గంగమ్మకు క్షీరాభిషేకం

రేణిగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం పట్టణంలోని నడివీధి గంగమ్మ త్రిశూలం నుంచి 216 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి మేళతాళాలతో తలపై క్షీర కలశాలతో గంగమ్మ ఆలయానికి చేరుతున్నారు. ఆలయంలోని మూలవిరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళాభక్తులు ఆలయంలో పొంగలి వండి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, ఉమేష్, లక్ష్మణ్ రెడ్డి, రావణ, చిన్నబాబు, సూరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


క్షీర కలశాలతో ఆలయ నిర్వాహకులు

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారి సేవలో శంకర్‌రెడ్డి తదితరులు



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరులో గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపన మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. యాగశాల పూజలు, నాడీసంధానం, ప్రాణప్రతిష్ఠ, కలశోద్వాసన, మహా కుంభాభిషేకం, అలంకారం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. గంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నారికేళ కర్పూర నీరాజనాలు సహా పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా గంగమ్మను సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి దర్శించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు శ్రీనివాసులు, మునెయ్య, మునిచంద్రనాయుడు, రవినాయుడు, మనోహర్‌నాయుడు, మధునాయుడు పాల్గొన్నారు.

చికెన్ దుకాణంపై దాడులు

తూకంలో మోసంపై కేసు నమోదు

వరదయ్యపాళెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురంలో ఓ చికెన్ దుకాణంపై జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు చేపట్టి తూకంలో మోసాన్ని గుర్తించారు. జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో గోవర్ధనపురంలోని చికెన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఐదు కిలోలకు 750 గ్రాములు ఎక్కువ చూపడంతో దుకాణ యజమాని మునిపై కేసు నమోదు చేవారు. గతంలో కూడా ఇదే దుకాణంపై మూడు పర్యాయాలు దాడులు చేసి కేసు నమోదు చేసినట్లు ప్రసాద్ తెలిపారు. తూనికల్లో వ్యత్యాసం చూపి ప్రజలను మోసంచేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీఎంకు పాలాభిషేకం

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్ వి.తోయజాక్షుడు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల సదర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా గౌడ కులస్థులకు మద్యం దుకాణాల్లో 10శాతం, లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వడం హర్షణీయమన్నారు. టీడీపీ తోనే గౌడ కులస్థుల అభివృద్ధి సాధ్యమన్నారు.

నిత్యావసరాల పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం నగరివీధిలోని సంస్థ కార్యాలయం వద్ద దివ్యాంగులు, వృద్ధులకు నెలసరి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 164 నెలలుగా నిత్యావసరాలు అందిస్తున్నానని సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషా చెప్పాడు. సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, గుమ్మళ్ల రాజేశ్వరరావు, హరినాయుడు, బాబా ఫరీద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలు అందిద్దాం


ప్రసంగిస్తున్న మీసేవ నిర్వాహకుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వేగంగా సేవలు అందించాలని రాష్ట్ర మీసేవ ఆపరేటర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. పట్టణంలోని పొన్నాలమ్మ కల్యాణ మండపంలో రాష్ట్రంలోని మీసేవ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంలో ప్రజలకుమంచి సేవలం దిస్తుండడం సంతోషకరమన్నారు. కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించిందన్నారు.సూర్యప్రకాష్, కిరణ్‌కుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వితరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగగంగ కాలనీలో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల, కళాశాలకు యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఐదు సీసీ కెమెరాలను ఆదివారం వితరణ చేశారు. విద్యార్థుల రక్షణ కోసం వీటిని ఇస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, వైస్ ప్రిన్సిపాల్, సంస్థ సభ్యులు ప్రదీప్‌కుమార్, పార్థసారథి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కలేనా?



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లేదని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చెప్పారు. మండలంలోని గాజులపెళ్లూరు, నెలవాయి, కాంపాళెం, కంచనపుత్తూరుల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ మండల కన్వీనర్ మణినాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ వి.రాకేష్, గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.